నవతెలంగాణ

1

ఆదిలాబాద్

శుక్రవారం | సెప్టెంబర్ 01, 2023 | www.navatelangana.com

వైద్య కళాశాలలో సీటు పొందిన విద్యార్థినికి ఆర్థికసాయం

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని చింతలసాంగ్వీ గ్రామానికి చెందిన సిడాం ప్రవళిక వైద్య కళాశాలలో సీటు సాధించింది. గురువారం రాజ్‌గోండు ఉద్యోగం సంఘం సభ్యులు ఇంటికెళ్లి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. రాజ్‌గోండు ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రవళికను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గోడం మోతీరాం, కార్యదర్శి గోడం త్రియంబక్, సెడ్మకి గోద్రు, కొడప కోసురావ్, తొడసం గోపాల్, కొడప భూమన్న పాల్గొన్నారు.



గురుకుల డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లాలో ఏర్పాటు కానున్న మహాత్మా జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాల(బాలుర)లో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ(ఈ.పి.హెచ్), బీకాం(సీఏ), బీఎస్సీ(ఎం.పీ.సీ.ఎస్), బీఎస్సీ (బీ.జెడ్.సీ)కోర్సులలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు గుడిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు గుడిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో లేదా సెల్ 7993456620, 9948989949 నెంబర్‌లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం..!

- ఇష్టారీతిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు
- సర్దుబాటు పేరిట నిబంధనలకు తూట్లు
- ప్రారంభానికే పరిమితమైన బయోమెట్రిక్ విధానం
- క్షేత్రస్థాయి పర్యవేక్షణ మరిచిన ఎంఈఓలు
- సర్కారు బడులపై దృష్టిసారించని ఉన్నతాధికారులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పాలన వ్యవస్థ కుంటుపడుతోంది. కొందరు విద్యాశాఖ అధికారులు, సిబ్బంది వైఖరి కారణంగా పరిపాలన గాడితప్పుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల లేమిని పరిష్కరించేందుకు అమలు చేసిన సర్దుబాటు ప్రక్రియను అధికారులు వారికి అనుకూలంగా మార్చుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లాలో 120మంది ఉపాధ్యాయులను వివిధ పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. కానీ కొంత మంది ఉపాధ్యాయులు వారికి నచ్చని చోటు కావడంతో బడులకు వెళ్లడం లేదు. ముఖ్యంగా సుమారు 30మంది ఉపాధ్యాయులకు ఓరల్ డిప్యూటేషన్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, కొన్ని సంఘాల నాయకుల సిఫార్సులతో వారికి అనుకూలమైన చోటుకు వెళ్లినట్లు తెలిసింది. ముఖ్యంగా జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న మండలాల నుంచి జిల్లా కేంద్రంతో పాటు సమీప పాఠశాలలకు వచ్చారు. మరికొన్ని పాఠశాలల్లో సర్‌ప్లస్ లేకపోయినా ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకుల సిఫార్సులతో వారికి అనుకూలమైన చోటుకు వెళ్లారు. దీంతో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడటంతో పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ప్రక్రియపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో వివిధ ఉపాధ్యాయ సంఘాలు పోరుబాట పట్టాయి. అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేయడంతో దిగొచ్చిన అధికారులు వాటిని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇష్టారీతిన డిప్యూటేషన్ల ప్రక్రియన చేపట్టిన అధికారుల వైఖరిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పత్తాలేని బయోమెట్రిక్..!

సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల సమయ పాలన..కచ్చితమైన హాజరు కోసం ప్రభుత్వం బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టింది. ఇందుకు ఆయా పాఠశాలలకు ఈ పరికరాలు అందించింది. ప్రారంభించిన తొలినాళ్లలో ఉపాధ్యాయులు వేలిముద్ర ద్వారా హాజరు నమోదు చేసుకున్నారు. కొన్నాండ్లకు ఈ విధానం మూలనపడింది. పరికరాలు చెడిపోవడం..కరెంటు లేదనే కారణంగా ఈ పరికరాలు పనిచేయడం లేదని, కొండ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్‌లు లేని కారణంగా ఉదయం 11గంటల్లోపు హాజరును డీఈఓ కార్యాలయానికి పంపించడం కష్టంగా మారింది. ఫలితంగా ఈ విధానం కొన్నాళ్లకే పరిమితమైంది. ఎంఈఓలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి ఉపాధ్యాయుల హాజరును పర్యవేక్షించాల్సి ఉండగా బడులకు వెళ్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఒక్కో ఎంఈఓకు మూడు మండలాల చొప్పున ఇంఛార్జి బాధ్యతలు ఉండటంతో పాటు వారి పనిచేస్తున్న పాఠశాలలోనూ విధులు నిర్వర్తించాల్సి ఉండగా ఈ పర్యవేక్షణ విషయాన్ని పూర్తిగా మరిచిపోతున్నారనే విమర్శలున్నాయి. ఎంఈఓ కార్యాలయంలో విధులు నిర్వర్తించే సిబ్బందే అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్నారనే ఆరోపణలున్నాయి.

దృష్టిసారించని ఉన్నతాధికారులు..!

జిల్లాలో విద్యావ్యవస్థలో లోపాలు చోటు చేసుకుంటున్నా..పరిపాలన గాడితప్పుతున్నా ఉన్నతాధికారులు దృష్టిసారించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కొందరు ఉపాధ్యాయులు ఇష్టారీతిన డిప్యూటేషన్‌పై వారికి అనుకూలమైన చోటుకు వెళ్లారని జాబితాతో సహా ఉన్నతాధికారులకు నివేదించారు. జిల్లా విద్యాశాఖాధికారి వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై ఆయా సంఘాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా స్పందించిన ఆయన శిక్షణ కలెక్టర్‌కు విచారణ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లా విద్యాశాఖ వ్యవహారంతో పాటు సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య లభించేలా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సర్కారు బడులపై తల్లిదండ్రులు కూడా దృష్టిసారించాలనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆదిలాబాద్

జిల్లాలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. నిబంధనలు యధేచ్ఛగా ఉల్లంఘనకు గురవుతున్నాయి. ఇష్టారీతిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల ప్రక్రియతో విద్యాశాఖ అబాసుపాలవుతోంది. సర్దుబాటు పేరిట నిబంధనలను వారికి అనుకూలంగా మార్చుకొని ఈ తతంతంగా సాగిస్తున్నారు. అధికారులతో లోపాయికారి ఒప్పందం మేరకు కొందరు ఉపాధ్యాయులు వారికి ఇష్టమొచ్చిన చోట్లకు డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రక్రియపై పలు ఉపాధ్యాయ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో కొందరు ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను అధికారులు రద్దు చేశారు. కానీ ఇంకా కొన్ని అలాగే ఉండిపోయాయనే వాదనలు ఉన్నాయి. తాజాగా జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దు చేసి వారి స్థానంలో కొత్త వారిని నియమించేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేయడం ఇందులో అక్రమాలు జరగాయడానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఉపాధ్యాయుల హాజరు కోసం కిందటేడాది అమల్లోకి తీసుకొచ్చిన బయోమెట్రిక్ విధానం ప్రారంభానికే పరిమితమైంది.



అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి : వృకోధర్, ఉపాధ్యాయ జేఏసీ నాయకుడు



విద్యాశాఖలో ఇటీవల సర్దుబాటు పేరిట చేపట్టిన ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలి. పాఠశాల విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘించి ఓరల్, లిఖితపూర్వకంగా డిప్యూటేషన్లు కేటాయించారు. మారుమూల ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి కేటాయించడం మూలంగా పేద విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఫలితంగా అక్కడి పాఠశాలల్లో బోధకులు లేకుండాపోయారు. కొన్ని పాఠశాలల్లో సర్‌ప్లస్ లేకున్నా నిబంధనలు అతిక్రమించి కేటాయించడం అన్యాయం. ఉన్నతాధికారులు దృష్టిసారించి వీటిని రద్దు చేసి సర్కారు బడులను పరిరక్షించాలి.

ధర్నా పోస్టర్లను ఆవిష్కరించిన ఏఐటీయూసీ నాయకులు



నవ తెలంగాణ-మందమర్రి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించే ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో మందమర్రి బ్రాంచి ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శనం మాట్లాడుతూ 11వ వేజ్‌బోర్డు 23 నెలల ఏరియర్స్ ఒకేసారి చెల్లించాలని, సంబంధిత సర్క్యులర్ తక్షణమే విడుదల చేయాలని, కోల్ ఇండియాలో సర్క్యులర్ విడుదల చేసి ఆగస్టు నెల పేమెంట్‌తో ఇస్తున్నారన్నారు. కానీ సింగరేణిలో సర్క్యులర్ రిలీజ్ చేయకుండా కాలయాపన చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సింగరేణి వ్యాప్త పిలుపులో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీ మందమర్రి జీఎం కార్యాలయం ముందు సాయంత్రం 4గంటలకు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు పెద్దపెల్లి బానయ్య, బండారి రాజేష్, పిట్ కార్యదర్శి సిహెచ్ పి శర్మ పిట్ సేఫ్టీ, మైన్ కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ - కాసిపేట



మండలంలోని దేవాపూర్‌లో నాగేశ్వర్(80) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఏఎస్ఐ బాలకిషన్ తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు నాగేశ్వర్ మద్యానికి బానిస కావడం, ఇదే క్రమంలో ఫైల్స్ రావడంతో కొన్ని నెలల నుంచి బాధపడుతున్నాడు. భార్యకు, పిల్లలకు ఫైల్స్ బాధిస్తున్నాయని చెప్పి మద్యానికి రూ.200 అడిగి బయటకు వెళ్లి మద్యం తాగి వచ్చాడు. భోజనం చేసి పడుకున్నాడు. రాత్రి అందరూ పడుకున్న తర్వాత ఇంటి వెనుకాల పెరటిలో ఉసిరి చెట్టుకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య గౌరుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీటీ రోడ్డు పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్




నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ నుండి బంగల్‌పేట్ వినాయక్ సాగర్ వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత నిర్మల్ పట్టణం అభివృద్ధిలో ముందుకెళ్తోందన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో రూ.3కోట్ల నిధులు వెచ్చించి బీటీ రోడ్డు పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. 42వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు వంటివి పలు అభివృద్ధి పనులు అతి త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. చైర్మన్ వెంట కమిషనర్ సి.వి.ఎన్ రాజు, ఏఈ హరిభువన్, కౌన్సిలర్లు లక్కాకుల నరహరి, మేడారం అపర్ణ ప్రదీప్, అబ్దుల్ మతిన్, కాంట్రాక్టర్ ఫులాన్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా శ్రీశ్రీశ్రీ అవధూత నంద మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని ప్యారమూర్ గ్రామంలోని దత్త ఆశ్రమంలో శ్రీశ్రీశ్రీ అవధూత నంద సరస్వతి స్వామి మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యేక పూజ అనంతరం మహారాజ్ పుట్టిన రోజు పురస్కరించుకొని భక్తులు కేక్ కట్ చేసి రాఖీలు కట్టారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయా గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆరోపణలు లేనప్పటికీ ఎస్పీ బదిలీ సరికాదు



నవతెలంగాణ-ఉట్నూర్

మహబూబాబాద్ జిల్లా ఎస్పీగా పని చేసిన శరత్‌చంద్ర మంచి పనితనం కలిగిన అధికారి అని, ఆయనపై ఎలాంటి ఆరోపణలు లేనప్పటికీ ప్రాధాన్యత లేని శాఖకు ఎందుకు బదిలీ చేశారని లంబాడి గిరిజన జేఏసీ జిల్లా శాఖ ముఖ్య సలహాదారు జాదవ్ గోపాల్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ అధికారులకు వివిధ పార్టీలలో బంధువులు ఉన్నంత మాత్రాన వారిపైన కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం సరైన విధానం కాదన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ బీఆర్ఎస్ నుండి రెండు సార్లుగా ఎమ్మెల్యేగా ఉన్నారని, మూడవసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వకపోవడం పార్టీ అంతర్గత విషయమన్నారు. పార్టీ మారుతానని ఎమ్మెల్యే ప్రకటించిన వెంటనే అల్లుడైన ఎస్పీని ప్రాధాన్యత లేని శాఖకు బదిలీ చేయడం సరికాదన్నారు. వెనుకబడిన గిరిజన లంబాడి సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులను వేధించడం, అవమానపరచడం రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన సామాజిక వర్గంలోని ఉద్యోగస్తులను ప్రోత్సహించాల్సింది పోయి అవమానం జరిగేలాగా బదిలీ చేయడం అన్యాయమన్నారు. బదిలీ చేసిన శరత్‌చంద్ర తిరిగి మహబూబాద్ ఎస్పీగానే పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో లంబాడి జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రామారావు, ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్ నాయక్, సంయుక్త కార్యదర్శి రాథోడ్ సుధాకర్, సలహాదారులు పవర్ విజయకుమార్ పాల్గొన్నారు.

మంత్రి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు



నవతెలంగాణ-నిర్మల్

రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధం, ఆప్యాయతకు ప్రతిరూపం రక్షాబంధన్ అని పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆయన సోదరీ రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. తోబుట్టువుల మధ్య రాఖీ పండగ జరుపుకోవటం సంతోషంగా ఉందని మంత్రి తెలిపారు.

18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి



నవతెలంగాణ-దండేపల్లి

18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని ఆర్డిఓ రాములు అన్నారు. గురువారం బూత్ లెవెల్ అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బూత్ లెవెల్ అధికారులతో ఆయా గ్రామాలలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అక్టోబర్ 1 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అర్హులని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక కార్యక్రమం ద్వారా అన్ని పోలింగ్ కేంద్రాలలో నమోదు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్ అప్లికేషన్ ద్వారా కొత్త ఓటర్ నమోదు కూడా చేసుకోవచ్చని తప్పు ఒప్పులు ఉన్న సరి చేసుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులకు పలు సూచనలు చేశారు. 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్య, ఎంపీడీవో మల్లేశం, ఎన్నికల సిబ్బంది, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ అందజేత



నవతెలంగాణ - కాసిపేట

నస్పూర్‌కు చెందిన బొద్దుల మహేందర్ తన మొబైల్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమైన కాసిపెట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ వివరాలను నమోదు చేసిన పోలీసులు గురువారం దాన్ని గుర్తించి బాధితునికి సీఐ మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ ఐఎంఈఐ నెంబర్లను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఫోన్‌ను గుర్తించడం జరిగిందన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటు కేసులను త్వరతగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గంగారాం పాల్గొన్నారు.

కేసీఆర్, హరీష్‌రావు చిత్రపటాలకు రాఖీలు కట్టి రెండో ఏఎన్ఎంల నిరసన



నవతెలంగాణ-నిర్మల్

తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ రెండో ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాఖీ పౌర్ణమి పండగను పురస్కరించుకొని దీక్ష శిబిరంలో సీఎం కేసీఆర్, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు చిత్రపటాలకు రాఖీ కట్టారు. అన్నాచెల్లెళ్ల ప్రేమ బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ పర్వదినాన తమను తమ తోబుట్టువుల్లా భావించి రెగ్యులర్ చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అనంతరం దీక్ష శిబిరంలోని ఏఎన్ఎంలు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో సుజాత, జానా, ఉమా, సునంద, శోభారాణి పాల్గొన్నారు.

నేటి చలో జీఎం ఆఫీస్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగంగా శుక్రవారం చేపట్టిన ఛలో జీఎం ఆఫీస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ కోరారు. గురువారం కాసిపేట గనిపై మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు కూడా 23 నెలల ఏరియల్స్ ఒకే దఫాలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణిలోని అన్ని జీఎం కార్యాలయాల ఎదుట సెప్టెంబర్ 1న సాయంత్రం 4గంటలకు ధర్నా కార్యక్రమం చేపడతామన్నారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు ధర్నా చేసి జీఎంకు వినతి పత్రం అందిస్తామని పేర్కొన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు బియ్యాల వెంకటస్వామి, దాసరి తిరుపతిగౌడ్, మీనుగు లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు అడెల్లి ఆలయం వద్ద దుకాణాల బహిరంగ వేలం

నవ తెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి శ్రీమహా పోచమ్మ దేవస్థానం సంవత్సరం పాటు వివిధ రకాల వస్తువుల విక్రయించేందుకు లీజు కోసం శుక్రవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రంగు రవికిషన్‌గౌడ్ తెలిపారు. బహిరంగ వేలంలో కొబ్బరికాయల దుకాణం, టెంట్ హౌజ్ వంటపాత్రలు, ఇడుపుడు పిల్ల మేకలను సేకరణ, తైయిబజార్ వసూలున్నాయని తెలిపారు. ఆసక్తి కలవారు శుక్రవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు.

పైడిపల్లిని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

నవతెలంగాణ-ఖానాపూర్

బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు పైడిపల్లి రవీందర్‌రావును గురువారం ఖానాపూర్ మండలం మాజీ ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ బీఆర్ ఎస్ ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను గెలుపు



కోసం అందరం కలిసి సమిష్టిగా బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. ఇందులో మండల మాజీ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సకరం (నల్ల) శ్రీనివాస్, ఖానాపూర్ మాజీ జెడ్పీటీసీ కారింగుల విజయ-రాములు, ఖానాపూర్ మాజీ సర్పంచ్ నేరెళ్ల సత్యనారాయణ ఉన్నారు.

మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఖానాపూర్ మెజిస్ట్రేట్ జితిన్ కుమార్

నవతెలంగాణ-ఖానాపూర్

మెగా లోక్‌అదాలత్‌ను కక్షిదారులు, ఫిర్యాదుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ మెజిస్ట్రేట్ జితిన్ కుమార్ అన్నారు. గురువారం ఖానాపూర్ కోర్ట్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీపడే కేసుల్లో ఫిర్యాదుదారులు, కక్షిదారులు ఇరువర్గాల వారు రాజీపడటం ద్వారా కేసులను పరిష్కరించుకోగలరని అన్నారు. ఈ అవకాశం సెప్టెంబర్ 1నుంచి 9వరకు ఉంటుందని అన్నారు. పెంబి, దస్తురాబాద్, కడెం, ఖానాపూర్ పోలీసు స్టేషన్‌లకి సంబంధించిన రాజీ పడేకేసులు అనగా డ్రంక్ అండ్ డ్రైవ్, ఆక్సిడెంట్, కోవిడ్ సమయంలో నమోదయిన మాస్క్ కేసులను సత్వరమే పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ, ఖానాపూర్ సీఐ మోహన్, ఖానాపూర్ ఎస్సై రుక్మావర్ శంకర్, పెంబి ఎస్సై రజినీకాంత్, కడెం, దస్తురాబాద్ ఎస్సైలు, కోర్ట్ సిబ్బంది, కోర్ట్ సీడీఓ హాజరయ్యారు.

నేడు పెన్షన్ విద్రోహ దినంగా ప్రకటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో గురువారం జాక్టో స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాక్టో నాయకులు జాదవ్ అశోక్ కుమార్, గీతేష్, పరశురాం మాట్లాడుతూ సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని ఉద్యోగ ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయులందరూ తమ పాఠశాల స్థాయిలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు అవ్వాలని, భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పెన్షన్ పొందడం ప్రభుత్వ ఉద్యోగికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. ప్రజాప్రతినిధులకు పెన్షన్ ఉండి 30 సంవత్సరాలు ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషించే ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు ఉద్యోగుల పెన్షన్ రద్దు చేయడం హేయమైన చర్యని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ సీపీఎస్‌ను కొనసాగించడం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని అన్నారు. వెంటనే పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శులు మూగ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రవీంద్ర పాల్గొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-దస్తురాబాద్

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాంపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగిలి మల్లవ్వ(26)అనే వివాహిత గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంటి వద్దనున్న బావిలో దుకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

ఘనంగా సరస్వతి సహిత చండి హోమం

నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి అమ్మవారి సన్నిధిలో పౌర్ణమి పురస్కరించుకొని గురువారం చతుర్వేద సరస్వతీ మంత్ర సహిత చండీ హోమం నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రోచ్చరణలతో గణపతి పూజా కలశ స్థాపన పూజలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం రాఖీ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అక్కలు, చెల్లెల్లు అన్నలకు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలుపుకొని మిఠాయి తినిపించుకున్నారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

పోగొట్టుకున్న పర్సు అందజేత

నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి అమ్మవారి దర్శనానికి వచ్చిన బోధన్ పట్టణానికి చెందిన భక్తురాలు గురువారం ఆలయంలో పర్సును పోగొట్టుకుంది. హోమ్‌గార్డు శ్రీనివాస్‌కు పర్సు దొరకడంతో వివరాలు కనుక్కొని ఆలయ సన్నిధిలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శివరాజ్ ఆధ్వర్యంలో భక్తురాలికి పర్సును అందజేశారు.

డిప్యూటేషన్‌పై పనిచేయడానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్లో ఇంగ్లీష్ మీడియంలో డిప్యూటేషన్‌పై పనిచేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ ప్రణీత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత సర్‌ప్లస్‌లో ఉపాధ్యాయులు సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సెప్టెంబర్ 4 లోగ అందజేయాలని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ గణితం 1, ఫిజికల్ సైన్స్ 1, సోషల్ 1, ఇంగ్లీష్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు.

ప్రపంచం సాంకేతిక వైపు పయనిస్తోంది

- ఆర్జీయూకేటీ డైరెక్టర్ సతీష్ కుమార్



నవతెలంగాణ-బాసర

ప్రపంచం సాంకేతిక వైపు ప్రయాణిస్తోందనిఆర్జీయూకేటీ డైరెక్టర్ సతీష్ కుమార్ అన్నారు. గురువారం యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ సాంకేతికత వైపు పోటీపడి 21వ శతాబ్దపు నైపుణ్యాలను పొందేందుకు ప్రతి ఒక్క విద్యార్థి ఇష్టపడి చదవాలని అన్నారు. యూనివర్సిటీలో 7 ఇంజనీరింగ్ బ్రాంచీలు ఉన్నాయని, మీ అభిరుచులను బట్టి ఆయా బ్రాంచీలో సీట్లను సంపాదించి, గొప్ప ఇంజనీర్‌గా ఎదగాలని, తల్లిదండ్రుల కలలను సహకారం చేయాలని అన్నారు. ఇంటర్ డిసిప్లీనరీ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అన్నారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ఇంజనీరింగ్ కోర్సుల నిర్వహణ, సలహాదారుడు, సేల్స్ ఇంజనీర్, ఆర్థిక విశ్లేషకుడు, డేటా విశ్లేషకుడు, డేటా సైంటిస్ట్, బ్రాండ్ అనాలసిస్ట్, కన్స్యూమర్ బిహేవియర్, ఎనాలసిస్ట్ బిగ్ డేటా ఇంజనీర్, ఫైనాన్స్ ఇంజనీర్‌గా రూపాంతరం చెందడానికి నూతనంగా వస్తున్న కోర్సులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని నేర్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. యూనివర్సిటీలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్‌పై శిక్షణను అందిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాఖీ కడుతూ నిరసన తెలిపిన ఏఎన్ఎంలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు ఎటువంటి రాత పరీక్షలు లేకుండా యథావిధిగా రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రెండో ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ యూనిటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. కాగా గురువారంతో ఈ సమ్మె 17వ రోజుకు చేరుకుంది. నిరసన కార్యక్రమంలో భాగంగా రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని పోలీసులకు, స్థానిక ప్రజలకు రాఖీలు కడుతూ ప్రభుత్వ వైఖరిని నిరసించారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేసేంతవరకు ఆందోళనలను కొనసాగిస్తూనే ఉంటామని పేర్కొన్నారు.

సమ్మెను శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ...

ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రెండో ఏఎన్ఎంలు చేపడుతున్న సమ్మె శిబిరాన్ని



గురువారం డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వెంటనే సమ్మె విరమించి, విధుల్లో చేరాలని కోరారు. సమ్మె విరమించని యెడల 30 శాతం వెయిటేజ్ మార్కులు కలపరని, శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుదని తెలిపారు. అనంతరం వారికి కూడా ఏఎన్ఎంలు రాఖీలు కట్టి రక్ష బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, యూనియన్ జిల్లా అధ్యక్షులు పుష్పాల మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి సావిత్రి, జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద బాయి, వెంకటమ్మ, సహాయ కార్యదర్శి విజయ సుందరి, తులసి, లక్ష్మి, లలిత ఉన్నారు.

మైనార్టీలకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట

నవతెలంగాణ-ముథోల్

మైనార్టీలకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందిని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం 16మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక చేయూతను మంజూరు చేశారు. అందులో భాగంగా లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ మైనార్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖలిద్, ఎంపీటీసీలు ఆత్మస్వరూప్, బండారి గంగాధర్, మాజీ సర్పంచ్ ఆరిపోద్దిన్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పోతన్న యాదవ్, దేవన్న, బషిర్, అశోక్, మక్బూల్ అహ్మద్ పాల్గొన్నారు.



మైనార్టీ బంధు పేరుతో మోసం

- డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు



నవతెలంగాణ-నిర్మల్

బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీ బంధు పథకం పేరుతో ముస్లింలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అస్రా కాలనీకి చెందిన ముస్లీం మైనార్టీ యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ యువత మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఇప్పటికీ మంజూరు చేయలేదని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మైనార్టీ బంధు పథకంతో రాజకీయ లబ్ధి పొందేందుకు ఇలాంటి వాగ్దానాలు చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ తప్పుడు హామీలకు మైనార్టీలు మోసపోవద్దని, కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అర్జుమాన్ అలీ, జునైత్, మతిన్, ఖీజర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని గోడపూర్ గ్రామానికి చెందిన కదం బాపూజీ గత కొన్ని రోజుల కింద కిడ్నీ సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో వారి సమస్యను స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి మెరుగైన వైద్యం కోసం రూ.2లక్షల 50వేల ఎల్‌ఓసీని అదే విధంగా బాధితుడి తండ్రి గంగాధర్ అనారోగ్యంతో ఉండటంలో రూ.90 వేల ఎల్‌ఓసీని ప్రభుత్వం తరపున మంజూరు చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్యం కొరకు ప్రభుత్వం లక్షల నిధులు మంజూరు చేసి, వారికి వైద్యం అందేలా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా ప్రతి పేద ప్రజలకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఎంతో కృషి చేస్తోందని అన్నారు. దీంతో కుటుంబ



సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విలాస్ గదేవార్, మురళీగౌడ్ ఉన్నారు.

హోంగార్డుల పాత్ర కీలకమైంది



నవతెలంగాణ-నిర్మల్

హోంగార్డుల పాత్ర కీలకమైందని జిల్లా అదనపు ఎస్పీ అన్నారు. గురువారం పదవీవిరమణ పొందిన సిందే బలరాం హోంగార్డును జిల్లా పోలీసు కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డు అధికారులు, పోలీస్ కానిస్టేబుల్ చేయాల్సిన, ప్రతి ఒక్క విధులను సమానంగా నిర్వహిస్తున్నారని అన్నారు. నేర నియంత్రణలో, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ నియంత్రణ, బ్లూ కోర్టు, పెట్రోల్ కార్ డ్రైవర్లు, కార్యాలయాల భద్రత, రాత్రి గస్తీ, బందోబస్తులలో హోంగార్డ్‌ల పాత్ర ఎంతో కీలకమైందని కొనియాడారు. హోంగార్డు అధికారులకు ఎలాంటి సమస్యలు ఉన్నా ఆర్ఐ హోంగార్డ్ ద్వారా తన దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరించేందుకు జిల్లా ఉన్నత అధికారులకు ద్వారా సమస్యలు పరిష్కరించి విధంగా చేస్తానని అన్నారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ ఆర్ఐ రామకృష్ణ, ఆర్ఐ రాంనిరంజన్, ఎంటీఓ వినోద్, దేవరావు, హోంగార్డు కుటుంబ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

అన్నాభావు సాఠే ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే అడుగు జాడల్లో నడిచి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్, ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. గురువారం మండలంలోని తాడిహత్నూర్, భోప్పపూర్ గ్రామంలో అన్నాభావు సాఠే 103వ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. ముందుగా దళిత నాయకులతో కలిసి జెండా ఆవిష్కరణ చేసి, సాఠే విగ్రహానికి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత చదువులు చదివి సమాజంలో మంచి గుర్తింపు తేవాలని అన్నారు. సాఠే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రేగుంట కేశవ్, జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్, అన్నాభావు సాఠే అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నర్సింగ్ మోరే, డీహెచ్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు శేఖర్ జాదవ్, సర్పంచ్ కనక సేవంత ప్రభాకర్, ఉపసర్పంచ్ విష్ణు, అన్నాభావు సాఠే మండల కమిటీ అధ్యక్షుడు కోరాల మహేందర్, గ్రామ పెద్దలు సూర్యవంశీ పండరి, జాదవ్ రాందాస్, మోతే రాజన్న, అన్నాభావు సాఠే గ్రామ కమిటీ సభ్యులు కాంబ్లే లక్ష్మణ్, సూర్యవంశీ భాస్కర్, భోస్లే పరమేశ్వర్, జాదవ్ పరమేశ్వర్, జాదవ్ రమేష్, తానాజీ, భావ్‌రావ్, మాధవ్, న్యానోబా, రమేష్, శ్యాంసుందర్, ధుత్రాజ్ మధుకర్, దమ్మనంద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు అనుసంధానంగా ఉన్న లేఔట్ లోని 20 ఫీట్ల రోడ్డును కొందరు కబ్జా చేసి ప్లాట్లు చేశారని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. ఈ విషయమై గురువారం హైదరాబాద్ ఆర్టీసీ భవనంలో ఎండీ సజ్జనార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు అనుసంధానంగా ఉన్న లేఔట్‌లోని 20 ఫీట్ల రోడ్డును ప్లాట్లు చేశారని అన్నారు. రివైజ్డ్ కొత్త లేఔట్ సృష్టించి అమ్మకాలు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. ఆర్టీసీ బస్టాండ్ స్థలం 1.12 గుంటల వరకు స్థలం ఉంటుందన్నారు. స్థలానికి ప్రహారిగోడ లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు సర్వే నంబర్ 42లో 20 ఫీట్ల రోడ్డును ప్లాట్లు చేశారని అన్నారు. 100 ఫీట్లు పొడవు 20 ఫీట్ల వెడల్పుతో ఆ రోడ్డును ఆర్టీసీ బస్టాండ్ స్థలంలోకి దారి తీశారని అన్నారు. దీనిపై దృష్టి సారించి, ఆర్టీసీ స్థలాన్ని కబ్జా కాకుండా చూడాలని పేర్కొన్నారు. గతంలో జిల్లా కలెక్టర్‌ను, ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌ను కలిశామని అన్నారు. కానీ వారు ఇంతవరకు సమస్య పరిష్కరించలేదని తెలిపారు. ఇప్పటికైనా మీరైనా దృష్టి సారించి ఆర్టీసీ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని, ప్రహారిగోడ నిర్మించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని ఆర్టీసీ స్థలాన్ని గుర్తించి, ప్రహారి నిర్మిస్తామని అన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహా ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని దన్నూర్(బి) గ్రామపంచాయతీలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి రూ.లక్షను ఎంపీపీ తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బండారు శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తొలిదశ ఉద్యమకారుడని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కొరకు మంత్రి పదవిని సైతం రాజీనామా చేశారని అన్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేసిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామ పంచాయతీలోని పోచమ్మ ఆలయానికి రూ.20వేలు అందజేశారు. విరాళాన్ని అందించినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లకొండ ప్రశాంత్, దేవిదాస్, గులాబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లచ్చంపూర్ గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లచ్చంపూర్ గ్రామానికి చెందిన సెడ్మకి సీతారాం(40) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు గత సంవత్సరం టీబీ వ్యాధితో బాధపడుతూ మతిస్థిమితం కోల్పోయి పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు గమనించి వెంటనే రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మరణించినట్టు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ధనశ్రీ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారులు ఉన్నారు.

సమ్మె నోటీస్ అందించిన అంగన్‌వాడీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీల సమస్యల పరిష్కరం కోరుతూ ఈనెల 11 నుంచి సమ్మె చేపడుతున్నామని అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.త్రివేణి అన్నారు. గురువారం కలెక్టర్ బోర్కడే హేమంత్, డీడబ్ల్యూవో సావిత్రిలను కలిసి సమ్మె నోటీసులు అందించారు. ఏళ్లుగా ఐసీడీఎస్‌లో పని చేస్తున్న సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. అధికారులు, ప్రభుత్వం, మంత్రుల దృష్టికి తీసుకువచ్చినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. సమస్యల పరిష్కారానికి జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 11 నుంచి సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.వనిత, లక్ష్మి పాల్గొన్నారు.

గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి సస్పెండ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమను సరిగ్గా ప్రిన్సిపాల్ చూసుకోవడం లేదని గిరిజన గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు బుధవారం ఆరు గంటల పాటు ధర్నా చేయడంతో జిల్లా అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మిని తక్షణమే విధుల నుండి తొలగిస్తున్నట్లు గురుకులాల సెక్రెటరీ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో అదే పాఠశాలలో పనిచేస్తున్న టీజీటీ అనితకు ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థులు చేసిన ఆందోళనలకు అధికారులు స్పందించడం పట్ల విద్యార్థినులు, విద్యార్థి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అయితే విద్యార్థుల ఆందోళనపై మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు ప్రచురితం కావడంతో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ స్పందించి విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. ఆర్సీవో గంగాధర్ గురువారం పాఠశాలలో పర్యటించి పరిస్థితులు చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఆందోళనకు దిగకముందే చర్య తీసుకుంటే బాగుండేదని విద్యార్థినులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సింగరేణి ఆధికారులకు సన్మానం



నవతెలంగాణ-రెబ్బెన

ఖైరిగూడ ఓసీలో ఉద్యోగ విరమణ పొందిన డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రభాకర్, శ్యాంరావు, రాజలింగు, సాంబయ్యను గురువారం ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ నాయకులు పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. బెల్లంపెల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయ పర్సనల్ మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన లక్ష్మణ్ రావును, డీఈపీ పురుశోత్తం రఘు, ఏరియా జీఎం డి.రవిప్రసాద్ ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ నాయకులు ఖైరిగూడ ఇన్‌ఛార్జి రెహమాన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జూపాక రాజేష్, ఖైరిగూడ పీ రిలే ఫిట్ కార్యదర్శి ఆంజనేయులు, సహాయ కార్యదర్శి కోటి, రాంకిశన్, గోపాల్, కాంట్రాక్టు కార్మిక కార్యదర్శి చల్లూరి అశోక్ పాల్గొన్నారు.

ముగింపు వజ్రోత్సవాలకు ఆసిఫాబాద్ నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో గల ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించే ముగింపు వజ్రోత్సవాలకు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు గురువారం బస్సులో బయలుదేరారు. ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కాడే హేమంత్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా అనేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కొనసాగించడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. హైదరాబాద్ బయలుదేరిన వారిలో జడ్పీటీసీలు రామారావు, అజయ్ కుమార్, ధృపదాబాయి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు జగ్గా గౌడ్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అబుతాలిబ్ ఉన్నారు.

జీపీ కార్యదర్శుల పనితీరు మరింత మెరుగుపడాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామ పంచాయతీ కార్యదర్శుల పనితీరు మరింత మెరుగు పడాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లాలో పనిచేస్తున్న 80 మంది పంచాయతీ సెక్రటరీలకు ఉత్తర్వులను కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలు ఇప్పటివరకు ఎంతో పని చేశారని దానితో రాష్ట్రానికి దేశంలో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. అయితే ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరింత పట్టుదలతో పని చేయాలన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు

- బీజేపీ ప్రధాన కార్యదర్శి చేకూరి నవీన్‌గౌడ్

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని బీసీలకు అందజేస్తున్న ఆర్థిక చేయూత కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకే అందుతోందని, అర్హులైన వారికి లబ్ది చేకూరడంలేదని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చేకూరి నవీన్‌గౌడ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇవ్వాల్సిన చెక్కులు లబ్ధిదారులకు ఫోన్ ద్వారా పిలిపించుకొని గుట్టుచప్పుడు కాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలకు అందిస్తున్నారన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎలాంటి లబ్ధిదారుల పేర్లు కలిగిన లిస్టు అతికించలేదని, నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. నిజమైన లబ్ధిదారులకు ఆర్థిక చేయూత అందాలని లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి లబ్ధిదారులకు బీసీ రుణాల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు లబ్దిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ బీసీలలో కులవృత్తులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం వారికి రుణాన్ని అందిస్తుందన్నారు. వంద శాతం సబ్సిడిపై అందించే ఈ రుణాల ప్రక్రియ నిరంతంగా కొనసాగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రానున్న రోజుల్లో అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఇంచార్జీ అధికారిని రమాదేవి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, జిల్లా పంచాయతీ అధికారి సురేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మైనార్టీలు బుద్ధి చెప్పాలి

- కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్ అలీ



నవతెలంగాణ-రెబ్బెన

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు అందజేస్తామని ఆశ చూపి మోసం చేస్తున్న బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్ అలీ అన్నారు. గురవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఆరు నెలల నుంచి మైనార్టీలను మోసం చేస్తోందన్నారు. కుమురంభీం జిల్లాలో మైనార్టీలకు సబ్సిడీ రుణాలు అందిస్తానని రాష్ట్ర ప్రభుత్వం గత ఆరు నెలల నుంచి మైనార్టీలను మోసం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రగల్బాలు పలుకుతుందే తప్పా రుణాలు అందించడంలో విఫలమవుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈ నెల 19వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ రుణాలు అందజేస్తామని చెప్పుకుంటూ పూట గడిపిందన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో మాత్రం ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం చెప్పిన సమయం దాటి రెండో విడత సమయం వచ్చినా నేటి వరకు మొదటి విడతలో ఏ ఒక్క పేద మైనార్టీకి కూడా రుణం అందజేయలేదన్నారు. రెండు, మూడో విడత లాగానే రుణాలు అందించడంలో చాలా జాప్యం చేస్తుందన్నారు. ఇది ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలను మభ్యపెట్టేందుకే ఇలాంటి హామీలు ఇస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై స్పందించి నిజమైన లబ్దిదారులకు సకాలంలో రుణాలు అందజేయాలన్నారు. రూ.లక్ష ప్రతి ఒక్కరికి ఇస్తానని చెప్పి ఇప్పుడేమో ముస్లింలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో మైనార్టీలు బుద్ధి చెప్పాలన్నారు.

బాలికల వసతిగృహాల్లో మహిళా ఉపాధ్యాయులను నియమించాలి

- ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మడావి భరత్ భూషణ్



నవతెలంగాణ-కెరమెరి

జిల్లా వ్యాప్తంగా ఉన్న బాలికల వసతి గృహాలు, గురుకుల పాఠశాలలో పూర్తి స్థాయిలో మహిళా ఉపాధ్యాయులనే నియమించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్ భూషణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పురుష ఉపాధ్యాయులకు బదులుగా, వారి స్థానంలో మహిళా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. రాత్రి సమయంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ, విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న సదరు వ్యక్తిని తొలగించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. బాలికల గురుకులాలతో పాటు వసతి గృహాల్లో పని చేస్తున్న పురుష సిబ్బందిని పూర్తిగా తొలగించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం కెరమెరి ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు సెడ్మకి తుకారాం, నాయకులు ఆడ ఆనంద్ పాల్గొన్నారు.

విధుల్లో చేరాలంటూ ఉన్నతాధికారుల ఒత్తిడి మానుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెగ్యులర్ చేయాలని సమ్మె చేస్తున్న రెండో ఏఎన్ఎంలను విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడం మనుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగి ఉపేందర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట రెండో ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె గురువారం 16వ రోజుకు చేరుకోగా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 16 రోజులుగా సమ్మె చేస్తున్న ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించకుండా విధుల్లో చేరాలని అధికారులకు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం సమస్య పరిష్కారంపై దష్టి సారించకపోతే భవిష్యత్తులో ప్రగతిభవన్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర నాయకురాలు వసంత, జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ఉపాధ్యక్షులు కమల, నాయకులు లక్ష్మీ, పుష్పలత, రాణి, రాధ పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో స్టడీ సర్కిల్ మెరుగైన ఫలితం

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థికి సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కుమురంభీం స్టడీ సర్కిల్ పేరుతో గిరిజనులకు ఉచిత కోచింగ్ అందించడానికి ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్ లక్ష్యం దిశగా మెరుగైన ఫలితాలు ఇవ్వడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది ఎస్ఎస్సీ జీడిగా ఉద్యోగం పొందిన రెబ్బెన మండలం దుగ్గగూడకు చెందిన మడవి గంగను నిర్వాహకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆదివాసీలు నేటికీ సరైన శిక్షణ అందక ఉద్యోగాలు సాధించడంలో వెనుకబడి ఉన్నారని అన్నారు. వారి నైపుణ్యాభివృద్ధికి స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిలో శిక్షణ పొందిన విద్యార్థులు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందన్నారు. తాను అనుకున్న లక్ష్యాన్ని చేరే దిశగా స్టడీ సర్కిల్ పయనించడంలో నిర్వాహకుల కృషి ఎంతగానో ఉందని కితాబునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ నిర్వాహకులు కాంపెల్లి ఊషన్న, రాజశేఖర్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఇందురావు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనందరావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని అనేక గ్రామాల నుంచి ప్రతిరోజు వివిధ పనుల నిమిత్తం అనేక మంది రాకపోకలు కొనసాగిస్తుంటారని తెలిపారు. మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మహిళలకు కాలకృత్యాలు తీర్చుకోవడంలో తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మండల కేంద్రానికి ప్రత్యేక నిధులు కేటాయించి, పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఇసాక్, సయ్యద్ నబి, నిఖిల్, శ్రీకాంత్, అయ్యూబ్ పాల్గొన్నారు.

అత్యపత్య జిల్లా కమిటీ అధ్యక్షునిగా కట్కర్ భీంరావు ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అత్యపత్య జిల్లా కమిటీ అధ్యక్షునిగా కట్కర్ భీంరావు ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడ పాఠశాలలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కద్కర్ భీంరావు, కార్యదర్శిగా బొమ్మకంటి కిరణ్, కోశాధికారిగా కడతల రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలకు పరిశీలకులుగా పీడీ తిరుపతి వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన కేసీఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు తారిక్ మాట్లాడుతూ జిల్లాలో అత్యపత్య క్రీడను అభివద్ధి చేయడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ కోచ్ చునార్కర్ అరవింద్, ఖోఖో కోచ్ తిరుమల, పీఈటీ కడ్తల రాకేష్, గోగర్ల సాయి, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా సామూహిక యజ్ఞోపవీతధారణ కార్యక్రమం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ఉమా మహేశ్వర మార్కండేయ ఆలయంలో గురువారం సామూహిక యజ్ఞోపవీతధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పద్మశాలి కులస్థులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సామూహిక యజ్ఞోపవీతధారణ చేసుకున్నారు. ఆలయ అర్చకులు పరికిపండ్ల కరుణాకర్, ఎనగంటి భిక్షపతి సమక్షంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

నవోదయలో రక్షాబంధన్ వేడుకలు

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. బీఎంఎస్ రాష్ట్ర నాయకులు కల్లోల భట్టాచార్య సమక్షంలో నిర్వహించిన ఈ వేడుకలలో విద్యార్థులు రాఖీలు కట్టుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : రాఖీ పౌర్ణమి వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి వేడుకల్లో ప్రముఖులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు నిర్వహించుకున్న తర్వాత పలువురికి రాఖీ కట్టారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు మహిళా నాయకురాలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఇరువురు జిల్లా ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.



ఆసిఫాబాద్ :

రాఖీ వేడుకల్లో టీడీపీ నాయకులు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్వహించిన రాఖీ పండుగ వేడుకలను టీడీపీ నాయకులు విద్యార్థులతో కలిసి జరుపుకున్నారు. విద్యార్థులతో రాఖీ కట్టించుకున్నారు. అనంతరం విద్యార్థినులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పెరుగు ఆత్మారాం, నాయకులు మల్లికార్జున్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయిరాం పోల్కర్, రాష్ట్ర కార్యదర్శి రామిళ్ల మహేష్, వేణు, రవి, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి : మండలంలోని అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో సర్పంచ్ రాథోడ్ శేషారావ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు రాఖీ కట్టించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు అందజేశారు.



కెరమెరి :

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం రాఖీ పౌర్ణమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుండే అక్కాచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీ కట్టి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదమ్ములు అక్కాచెల్లెళ్లకు బహుమతులు అందజేసి సుఖ సంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయ పర్యవేక్షకులు అరవింద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒప్పంద పద్ధతిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్స్-10, సివిల్ అసిస్టెంట్ సర్జన్-1, పొరుగు సేవల పద్ధతిన సిటీ స్కాన్ టెక్నీషియన్-1, ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 -1, థియేటర్ అసిస్టెంట్-1 పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని, మార్చి 31, 2024 వరకు పని చేయవలసి ఉంటుందని, అవసరం మేరకు నియామకం జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 1న ఉదయం గం.10.30ల నుంచి 8వ తేదీ సాయంత్రం గం4.00 ల వరకు కార్యాలయ పని వేళలలో జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయంలో దరఖాస్తుతో పాటు సంబంధిత ధృవపత్రాల నకలు ప్రతులను సమర్పించాలని, వివరాలకు మంచిర్యాల.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు గోదావరి రేవులోని హస్తినామడుగులో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు జాదవ్ రామ్ కిషన్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లిఫ్ట్ ఇరిగేషన్ వేసినట్లయితే జన్నారం, దండేపల్లి మండలాల రైతులకు ఈ లిఫ్ట్ ద్వారా నీరు అందించి రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే, ఈ లిఫ్టుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి సాయశక్తుల కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థిగా ఎవరికి అవకాశం కల్పించిన వారి గెలుపుకు కృషి చేస్తానని అన్నారు. ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలన్నారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిడి పెల్లి ఇంద్రయ్య పాత బాలరాజు, నందు నాయక్ దోమల రమేష్, గంగన్న కనాకరావు, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక యువతి బలవన్మరణం



నవతెలంగాణ - చింతలమానెపల్లి

వేధింపులు తాళలేక యువతి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని గంగపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం గంగపూర్ గ్రామానికి చెందిన దంద్రే సుప్రియ(18) అదే గ్రామానికి చెందిన యువకుడు అంజన్న ఫోన్ ద్వారా నిత్యం మెసేజ్‌లు పంపుతూ ఇబ్బందులు పెట్టేవాడు. అంజన్నతో అమ్మాయికి సంబంధం ఉందని గ్రామంలో పుకార్లు వచ్చాయి. మానసికంగా కుంగిపోయిన సుప్రియ గురువారం చేను పనుల కోసం తీసుకువచ్చిన పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి సిర్పూర్-టి ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి వెంకన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్



వ్యక్తిగత కారణాలతో మానసికంగా కృంగిపోయి జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీసీసీ ఎస్సై రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్‌కి చెందిన ముత్తె మల్లేశం(55) వ్యాపారం చేసుకుంటూ నివసించేవాడు. కొన్ని రోజులుగా వ్యక్తిగత కారణాలతో ఇబ్బందులు పడుతున్నాడు. బుధవారం సాయంత్రం బయటికి వెళ్లి పురుగులమందు తాగి కుమారునికి ఫోన్ చేసి ఇవే నా చివరి మాటలు అని చెప్పాడు. తండ్రి ఫోన్ లొకేషన్ ఆధారంగా అతను ఉన్న ప్రదేశానికి కుమారుడు చేరుకున్నాడు. తండ్రి అపస్మారక స్థితిలో ఉండగా వెంటనే మంచిర్యాల ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రయివేట్ అస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం చనిపోయాడు. కుమారుడు శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కూతుళ్ల, కుమారుడు ఉన్నారు.

ప్రారంభమైన 50 రోజుల ఉపవాస దీక్షలు



నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి, సోమగూడెం రహదారి మధ్యలో కల్వరీ మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ ప్రవీణ్ చేపడుతున్న 50 రోజుల ఉపవాస ప్రార్థనలు భక్తిప్రత్తుల నడుమ ప్రారంభించారు. ఎంతో ప్రాముఖ్యత చెందిన కల్వరీ చర్చ్ పాస్టర్ ప్రవీణ్ ప్రతి ఏడాది 50 రోజుల ఉపవాస దీక్షలు చేపడుతున్నారు. దీనికి తెలంగాణాతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారూన్ దేశశాంతి సూచనగా పావురాళ్లను ఎగరవేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపవాస ప్రార్థనలు చేసి దైవ సందేశాన్ని వినిపించారు. భారతదేశ క్షేమం, దేశ ప్రజల క్షేమాభివృద్ధి, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, జాతి, కుల, మత బేధం లేకుండా కలిసి మెలిసి ఉండాలని పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారూన్ సందేశానిచ్చారు. అనంతరం బేబీ అక్షయ ప్రత్యేక ఆరాధాన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ముత్తినేని రవికుమార్, మ్యూజిక్ డైరెక్టర్ లీనస్, వివిధ రాష్ట్రాల ప్రజలు పాల్గొన్నారు.

మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని శ్రీమార్కండేయ స్వామి దేవాలయంలో పద్మశాలి కులస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రక్షాబంధన్ రాఖీ పౌర్ణమి సందర్భంగా గురువారం దేవాలయంలోని శ్రీమార్కండేయ స్వామివారిని అలంకరించి వివిధ పూజలు చేశారు. స్వామికి పంచామృత అభిషేకం, గణపతి పూజ యజ్ఞోపవీత ధారణ తదితర పూజది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు ఆడపిల్ల నారాయణ మాట్లాడుతూ పద్మశాలీలు నూలు పౌర్ణమిగా పిలవబడు రాఖీ పౌర్ణమి రోజు ప్రతి ఒక్కరూ విధిగా జంజం (యజ్ఞోపవీత) ధారణ గాయత్రి మంత్రం ఉచ్చరించి భక్తిశ్రద్ధలతో ధరిస్తారన్నారు. రాఖీ పండుగను నూలు పౌర్ణమిగా భావించి పద్మశాలీలు మగ్గం వేయడం బంద్ చేయడం ఆనవాయితీ అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం టౌన్ ప్రెసిడెంట్ బాలిన మధు, దోమల భాస్కర్, బొమ్మకంటి నాగభూషణ్, మంచాల శ్రీనివాస్, నందనాల బుచ్చన్న, దూష పరశురాం, పోతు సత్తన్న, వాసాల నరేష్, ఆడెపు సత్తన్న, అయ్యోరి శ్రీనివాస్, శ్యామల, అంజన్న, దోమల రమేష్, కోటేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు కృషి

- ఆర్టీసీ డిప్యూటీ ఆర్.ఎం.ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఉన్న ఆరు డిపోలను లాభాల వైపు తీసుకెళ్లేలా తన వంతుగా కృషి చేస్తున్నామని డిప్యూటీ ఆర్‌ఎం ఎస్. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నవ తెలంగాణతో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులోనే ప్రయాణికులు ప్రయాణించాలని ప్రైవేట్ వాహనాల్లో ప్రయణించవద్దని, ఆర్టీసీ సంస్థ సురక్షితమని సూచించారు. ఈ సంస్థను ప్రజలు ఆదరించాలని కోరారు.

గమ్యం యాప్‌తో ఇబ్బందులు దూరం

ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఇటీవల ఆర్టీసీ గమ్యం యాప్ ను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ గమ్యం యాప్ ద్వారా మనకు కావాల్సిన బస్సు ఎక్కడుందో ఎప్పుడొస్తదో వివరంగా తెలియజేస్తుందని చెప్పారు. ఈ యాప్ గురించి ప్రజలకు తెలిపేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని.. అలాగే ఈ యాప్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 15 వేలకు పైగా మంది డౌన్లోడ్ చేసుకున్నారని తెలిపారు. ప్రయాణికులు అందరు కూడా ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. కాగా పల్లె వెలుగు బస్సులో తప్ప అన్నిటికీ ట్రాకింగ్ సిస్టం ఉందని తెలిపారు.

ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు..!

బస్ స్టేషన్‌లలోని స్టాళ్లలో ఎమ్మార్పీ ధరకు మాత్రమే వస్తువులను విక్రయించాలని, ఎక్కువ ధరకు విక్రయించినట్లు తెలిస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయాణికులకు ఎవరైనా ఇలాంటి సందర్భం ఏర్పడితే అక్కడ స్టాళ్ల దగ్గర తమ నంబర్లు ఉంటాయని వాటిని సంప్రదించి తమకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 2023- 2024, 2024-25 సంవత్సరానికి మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల బస్సులను లాంఛనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఇందులో మన ఆదిలాబాద్ జిల్లాకు ప్రస్తుతం ఎలాంటి బస్సులు కేటాయించలేదని తెలిపారు. భవిష్యత్ లో రావొచ్చని స్పష్టం చేసారు. ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసిందని కానీ దానికి సంబంధించిన గెజిట్ రాలేదని అన్నారు. గెజిట్ తర్వాత జీవో రావాలన్నారు. దీని కోసం ముగ్గురు ఐఎఎస్ లతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. దీనికి కొంత సమయం పడుతుందని వివరించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి ఫైసుల్లా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నాయకురాలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలు పార్టీని గ్రామాల్లో పటిష్టం చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు రామ్‌కిషన్ నాయక్, మండల మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ, జన్నారం గ్రామ మహిళ అధ్యక్షురాలు లావణ్య, జిల్లా ఎస్టీ సెల అధ్యక్షులు అజ్మీర్ నందు నాయక్, జిల్లా ప్రధానకార్యదర్శి ముత్యం రాజన్న, పట్టణ అధ్యక్షులు దుమాల రమేష్ రేండ్లగూడ ఎంపీటీసీ మమత కరుణాకర్, మండల ఎస్సీ సెల్, ఎస్టీ సెల్ అధ్యక్షులు మామిడిపల్లి ఇందయ్య బోడ రవి నాయక్, ఉపాధ్యక్షులు ఉరువేత ధర్మ, అధికార ప్రతినిధి ఏ.వి.రాజం, పాత బాలరాజు,వాసాల రాజేశం, గాబ్రియల్, యువజన కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇమ్రాన్, మంద రాజేష్, ప్రవీణ్, సాగర్ గౌడ్, సన్నీ గౌడ్, మంత్రి లచ్చన్న, దుర్గం రవి, పి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం



నవతెలంగాణ-మందమర్రి

పదవీ విరమణ పొందుతున్న అధికారికి జీఎం కార్యాలయ అధికారులు సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసిన కొంక శ్రీహరి పదవీ విరమణ పొందిన సందర్భంగా జీఎం కార్యాలయ అధికారులు, సిబ్బంది వీడ్కోలు సన్మాన సభను మందమర్రి ఎల్లందు క్లబ్‌లో నిర్వహించారు. శ్రీహరి చేసిన సేవలను కొనియాడుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జీఎం విజయ్ కుమార్, టీబీజీకేఎస్ స్ట్రక్చర్ కమిటీ మెంబర్ రమణ, ఏఐటీయూసీ నాయకులు సాంబ శివరెడ్డి, ఇన్‌ఛార్జి ఎస్‌ఓటు జీఎం ఎం.రవీందర్, ఏజీఎం ఈ అండ్ ఎం నాగరాజు, డీజీఎం పర్సేస్ సురేష్, ఇన్‌ఛార్జి పర్సనల్ మేనేజర్ మైత్రేయ బందు, సంక్షేమాధికారి శ్రీనివాసరావు, ఓఎస్ రాజలింగు, ఆఫీస్ పాల్గొన్నారు.

నస్పూర్ : సింగరేణిలో పనిచేసే పదవి విరమణ పొందుతున్న అధికారులను, ఉద్యోగులను గురువారం ఘనంగా సన్మానించారు. శ్రీరాంపూర్ ఏరియాలో డీజీఎం సివిల్‌గా పనిచేసి పదవి విరమణ పొందుతున్న శివరావును జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే,జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి ఉద్యోగులకు పరిసర ప్రాంత ప్రజలకు మంచినీటిని ఇవ్వడంలో చేసిన కృషి అమోఘమని కొనియాడారు. శివరావు శ్రీరాంపూర్ ఏరియాలో సివిల్ విభాగానికి ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంలో తనదైన ముద్రవేశారని పేర్కొన్నారు.

కాసిపేట : మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కోల్ కట్టర్లు కందుల రాజ మొగిలి, భూమయ్య, కోల్ కట్టర్ బుడేలు పదవి విరమణ పొందగా వారికి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ అల్లావుద్దీన్, సేఫ్టీ ఆఫీసర్ సునీల్ కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ జీషాన్, టీబీజీకేఎస్ నాయకులు బైరి శంకర్, సమ్మయ్య, ఏఐటీయూసీ నాయకులు దాగం మల్లేశ్, బియ్యాల వెంకటస్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండుగా వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న నివాసంలో గురువారం రాఖీ పండుగ సోదరి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రేమానురాగాలకు ప్రత్యేకతగా రక్షాబంధన్ పండుగా సనాతన ధర్మంలో ప్రాచుర్యం పొందిందని అన్నారు. ఇలాంటి పండగలు కుటుంబాలలో ఆనందాలు విరిసిల్లెల అన్నా తమ్ముడు, అక్కాచెల్లెండ్లు ప్రేమానురాగాలు పంచుకునే రోజుగా రాఖీ పండుగ ఆడపడుచులకు స్వాగతం చెప్పే గొప్ప పండుగని అన్నారు. కార్యక్రమంలో దుర్గం శేఖర్, సాజిదోద్దీన్, పర్వీన్, రేవతి బెంజి, కస్తాల ప్రేమల, ఆసిఫ్, ఖయ్యూమ్, మద్దుల ఆశ, సురేఖ, అంజలి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : రాఖీ పౌర్ణమి పండగ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ నివాసంలో గురువారం సందడి నెలకొంది. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిల్కూరి జ్యోతిరెడ్డి, బ్రహ్మకుమారీ ఈశ్వరియ విశ్వవిద్యాలయం నిర్వహకురాలు రేవతి బెహేన్, పాయల్ శంకర్‌కు రాఖీ కట్టి తమ అన్న చెల్లెళ్ల ఆత్మీయతను చాటుకున్నారు. కాగా ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు, బంధుమిత్రులకు పాయల శంకర్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

తలమడుగు : అన్నచెల్లెళ్ల అనుబంధం మరువలేనిదని విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి అన్నారు. గురువారం రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని రుయ్యాడిలోని తమ నివాసంలో అక్క, చెల్లెలు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు కలిసి నిర్వహించుకునే పండుగ అని అన్నారు. ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులతో పాటు అన్న, అక్క చెల్లెలు కలిసి ఉన్నట్లయితే జీవితమే సంతోషంగా ఉంటుందన్నారు.

కాసిపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా రాఖీ పండుగ వేడుకలను నిర్వహించారు. తమ తమ అన్నదమ్ములకు అక్కా చెల్లెల్లు రాఖీలు కట్టి తమ ప్రేమానురాగాలను పంచుకున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా రాఖీ పండుగ వాతావరణం ఉత్సాహంగా కనిపించింది. అక్కా చెల్లెలు తమ సోదరులకు రాఖీలు కట్టగా తమ వంతుగా సోదరులు కానుకలు అందించి వేడుకలు జరుపుకొని ఇంటిళ్ల పాది ఆనందంగా గడిపారు.

నస్పూర్ : రక్షాబంధన్ సందర్భంగా గురువారం శ్రీరాంపూర్ ఏరియ జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డికి మంచిర్యాల బ్రహ్మకుమారి బహేన్‌జీలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మ సిందుజా సిస్టర్స్ ఉన్నారు.



నార్నూర్ : మండలంలోని అన్ని ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. అక్క చెల్లెలు అన్నదమ్ములను రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. దీనితో పాటు జామడ ఆశ్రమ బాలికల పాఠశాలతో పాటు వివిధ పాఠశాలలో విద్యార్థినులు ఉపాధ్యాయులకు విద్యార్థులకు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ, ఉపాధ్యాయ సిబ్బంది విశ్వనాథ్, ముక్తా, పుష్పలత, ప్రేమ్ కుమార్, కైలాస్, హరిచంద్, శివాజీ, గంగాధర్, రవికుమార్, మల్కు, కల్పన రాజ్యలక్ష్మి రజనీకాంత్ అన్నారు.

ఇంద్రవెల్లి : అన్నదమ్ముల అక్క చెల్లెలా అనుబంధం రాఖీ పండుగను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలానికి మహారాష్ట్రతో దగ్గర సంబంధాలు ఉండటంతో అక్కడి నుంచి అక్క, చెల్లెల్లు తన అన్నదమ్ములకు రాఖీ కట్టడం కోసం బయలు దేరి వెళ్లారు. తమ అన్నదమ్ములకు రాఖీ కట్టడం వల్ల ఆయువు పెరిగి వంద వసంతాలు ఆయురారోగ్యాలు జీవించాలని ఆశీర్వదించడం ఈ పండగ ముఖ్య ఉద్దేశం.

బోథ్ : హైదరాబాద్‌లోని సీఎం ఓఎస్‌డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే కూతురు పెండ్లికి హాజరయ్యారు. గురువారం రాఖీ పండుగను పురస్కరించుకొని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావుకు బోథ్ జెడ్పీటీసీ రజనాల సంధ్యారాణి రాఖీ కట్టారు. పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దహెగాం



ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సాయంత్రం మండలంలోని ఐనం గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్సై ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం ఐనం గ్రామానికి చెందిన ఆత్మకూరి లక్ష్మీపతి(59) మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన కుమారుడు, భార్య తలుపులు మూసి ఉండడంతో అనుమానం రావడంతో తెరచి చూశారు. అప్పటికే లక్ష్మీపతి మరణించాడు. మృతుని కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పోలీస్ సబ్ డివిజన్పరిధిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్సీయల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సొసైటీ బెల్లంపల్లిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలోల విద్యార్థిని, విద్యార్థులకు సైబర్ క్రైమ్, మహిళ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ. సదయ్య హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ మహిళా భద్రత, రక్షణ కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందనితెలిపారు. మహిళల్లో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని కల్పించడం కోసం పోలీస్ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాలు ఎంచుకొని భవిష్యత్తును నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి-1 టౌన్ ఇన్స్‌పెక్టర్ శంకరయ్య, బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్ కుమార్ గౌడ్, ఎస్సైలు ప్రవీణ్ కుమార్, విక్టర్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఉరేసుకొని రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన రైతు పానుగంటి రాజేశ్వర్(60) అప్పుల బాధ భరించలేక పొలంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రైతుకు భార్య లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రుక్మావర్ శంకర్ తెలిపారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు

- సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ - హాజీపూర్

సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు చేస్తున్న సమ్మె 16వ రోజుకు చేరింది. గురువారం ఎమ్మెల్యే దివాకర్‌రావుకు రాఖీ కట్టి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఏంలను తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి కాంట్రాక్ట్ ఎఎన్‌ఏంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, తెలంగాణ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు పద్మ, సరిత, పద్మ, సత్యవతి, రాజమణి, రమ, లలిత, రాణి పాల్గొన్నారు.

ఓటరు లిస్టులో అవకతవకలు

ఆదిలాబాద్‌టౌన్ : గత ఎన్నికలలో మాదిరిగానే ఈ సారి కూడా ఓటరు లిస్టులో అవకతవకలకు జోగు రామన్న పాల్పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు, జాతీయ ఎన్నిక కమిషన్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా గురువారం ఫిర్యాదు చేశారు. 2018 ఎన్నికల్లో బీజేపీకి అనుకూలమైన చాలా చోట్ల దాదాపు 20 వేల ఓట్లను గల్లంతు చేశారని అన్నారు. న్యాయంగా ఎదుర్కొనే దమ్ము లేక అడ్డదారులు తొక్కుతున్నారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ అధికారులు సమగ్రంగా విచారణ జరిపి ఓటరు లిస్టులను తయారు చేయాలని అన్నారు. ఒక ఇంటి నెంబర్‌పై ఆరు ఓట్ల కంటే అధికంగా ఉన్న ప్రాంతాల్లో సర్వే జరిపించాల్సి ఉండగా ఇప్పటివరకు ఆ కార్యక్రమం జరపకుండా ఆర్డీఓ కార్యాలయాన్ని మేనేజ్ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ముకుంద్, భూమారెడ్డి, కేశవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

నేరడిగొండ : కారు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన లింగన్న ఉపాధి కోసం నిర్మల్‌లో ఉంటున్నాడు. రాఖీ పండుగను పురస్కరించుకొని తమ గ్రామానికి వచ్చారు. తన చెల్లితో రాఖీ కట్టించుకొని తిరుగు ప్రయాణంలో భార్య నర్సవ్వ(40)తో పాటు తమ్ముడు కళ్యాణ్‌తో కలిసి నిర్మల్ వెళుతున్న క్రమంలో నేరడిగొండ పెట్రోల్ పంపు ముందర కారు వేగంగా బైక్ బైకును ఢీ కొట్టింది. దీంతో నర్సవ్వ, లింగన్న, కళ్యాణ్ బైక్‌పై నుంచి కింద పడ్డారు. నర్సవ్వ తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. అన్నదమ్ములకు తీవ్ర గాయాలయ్యాయి స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సాయన్న తెలిపారు.